# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేదీ : 12-09-2025** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **భారత ఉప రాష్ట్రపతిగా సీపీ రాధాకృష్ణన్ ఈ ఉదయం 10 గంటలకు ప్రమాణ స్వీకారం చేయనున్నారు.**

2. **క్వాంటమ్ కంప్యూటింగ్ రంగానికి అమరావతి క్వాంటమ్ వ్యాలీ కేంద్రంగా మారనుందని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు.**

3. **నేపాల్ లోని ఖాట్మాండు నుంచి ప్రత్యేక విమానంలో 144 మంది ఆంధ్రప్రదేశ్ వాసులు రాష్ట్రానికి చేరుకున్నారు.**

4. **సుస్థిర ఆర్థికాభివృద్ధికి దోహదపడే ఆవిష్కరణలను ప్రోత్సహించాల్సిన అవసరముందని తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ సూచించారు.**

5. **చౌక ధరల దుకాణాల ద్వారా పారదర్శకంగా రేషన్ సరుకుల పంపిణీ చేస్తున్నామని ఆంధ్రప్రదేశ్ పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు.**

============================

భారత ఉప రాష్ట్రపతిగా సీపీ రాధాకృష్ణన్ ఈ ఉదయం 10 గంటలకు ప్రమాణ స్వీకారం చేయనున్నారు. రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఆయనతో ప్రమాణం చేయించనున్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కేంద్ర మంత్రులతో పాటు పలువురు పార్లమెంట్ సభ్యులు పాల్గొననున్నారు. ఉప రాష్ట్రపతి ఎన్నికకు ఈ నెల 9న జరిగిన పోలింగ్‌లో ఎన్డీయే కూటమి అభ్యర్థిగా సీపీ రాధాకృష్ణన్ జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డిపై 152 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. ఎన్నిక ప్రక్రియ పూర్తి కావడంతో నిన్న మహారాష్ట్ర గవర్నర్ పదవికి సీపీ రాధాకృష్ణన్ రాజీనామా చేశారు. దీంతో మహారాష్ట్ర బాధ్యతలను గుజరాత్ గవర్నర్ ఆచార్య దేవవ్రత్‌కు రాష్ట్రపతి ముర్ము అప్పగించారు. ఇదిలా ఉండగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గత రాత్రి ఢిల్లీ చేరుకున్నారు. ఈ ఉదయం జరిగే ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో చంద్రబాబు నాయుడు పాల్గొనున్నారు.

---

భారతదేశపు క్వాంటమ్ కంప్యూటింగ్ రంగానికి అమరావతి క్వాంటమ్ వ్యాలీ కేంద్రంగా మారనుందని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో స్టార్టప్‌లు, విద్యా సంస్థలు, పరిశోధనా సంస్థల ప్రతినిధులతో ముఖ్యమంత్రి నిన్న ఉన్నత స్థాయి సమావేశాన్ని

నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ, అమరావతి క్వాంటమ్ వ్యాలీలో దేశంలోనే మొదటి క్వాంటమ్ రిఫరెన్స్ సదుపాయాన్ని ఏర్పాటు చేయనున్నామని తెలిపారు. రిఫరెన్స్ సౌకర్యం స్వదేశీ ఆవిష్కరణలను వేగవంతం చేయడంతో పాటు అవసరమైన సదుపాయాలను అందజేసి దిగుమతుల మీద ఆధారపడటాన్ని తగ్గిస్తుందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

---------------------------

నేపాల్లో చిక్కుకున్న ఆంధ్రప్రదేశ్ వాసులు సురక్షితంగా రాష్ట్రానికి చేరుకుంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రత్యేక విమానంలో ఖాట్మండు నుంచి రాష్ట్రానికి 144 మంది నిన్న చేరుకున్నారు. వీరిలో 104 మంది విశాఖపట్నం విమానాశ్రయానికి, 40 మంది తిరుపతి విమానాశ్రయానికి చేరుకున్నారు. ప్రత్యేక విమానంలో తిరుపతి విమానాశ్రయానికి గత రాత్రి 62మంది చేరుకున్నారు. వారిలో వెంకటేశ్ అనే ప్రయాణికుడు ఆకాశవాణితో మాట్లాడుతూ,

వాయిస్ 25 సెకన్లు

మరోవైపు నేపాల్లోని హేటౌడా నుంచి బస్సులో బయలుదేరిన 22 మంది తెలుగువారు బిహార్ సరిహద్దు ద్వారా భారత్ లోకి ప్రవేశించారు. అలాగే నేపాల్ సిమికోట్ నుంచి ప్రత్యేక విమానం ద్వారా 12 మందిని లక్నోకు తరలించారు. అక్కడి నుంచి ప్రత్యేక విమానంలో రాష్ట్రానికి ఈ రోజు చేరుకోనున్నారు.

---------------------------

సుస్థిర ఆర్థికాభివృద్ధికి దోహదపడే ఆవిష్కరణలను ప్రోత్సహించాల్సిన అవసరముందని తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ సూచించారు. హైదరాబాద్ ఐఐసీటీలో 'ఈజ్ ఆఫ్ డూయింగ్ ఆర్అండ్డీ' అంశంపై ప్రాంతీయ సంప్రదింపుల సమావేశంలో గవర్నర్ నిన్న ప్రసంగించారు. ప్రాంతీయ అసమానతలు తొలగించడానికి శాస్త్రీయ ఆవిష్కరణలు మారుమూల ప్రాంతాలకు చేరాలని అభిప్రాయం వ్యక్తం చేశారు. పరిశోధన సంస్థలు అభివృద్ధి చేసిన సాంకేతికత ఎక్కువమందికి ఉపయోగపడేలా కృషి చేయాలని గవర్నర్ తెలిపారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ కు 15 నెలల వ్యవధిలో 11 లక్షల కోట్ల పెట్టుబడులు ఖరారయ్యాయని పరిశ్రమల శాఖ మంత్రి టిజి భరత్ తెలిపారు. అమరావతి సచివాలయంలో మంత్రి నిన్న పాత్రికేయులతో మాట్లాడుతూ, ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగ అవకాశాలను కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. రాష్ట్రంలో ఏర్పాటు చేసే ఏ పరిశ్రమకైనా భూమిని కేటాయించే విషయంలో ప్రభుత్వం వివిధ స్థాయిల్లో పరిశీలించిన తర్వాత మాత్రమే అనుమతులు ఇవ్వడం జరుగుతుందని చెప్పారు. పెట్టుబడులు, ఉద్యోగాల కల్పన విషయంలో అసత్య ప్రచారం చేయడం సరికాదని మంత్రి పేర్కొన్నారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా ప్రతి నెలా 29,796 చౌక ధరల దుకాణాల ద్వారా రేషన్ కార్డుదారులకు పారదర్శకంగా సరుకుల పంపిణీ చేస్తున్నామని పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. విజయవాడ కానూరులోని పౌరసరఫరాల భవన్ లో మంత్రి గత సాయంత్రం పాత్రికేయులతో మాట్లాడుతూ రాష్ట్రంలో 96 శాతం కార్డులకు ఈకేవైసీ పూర్తి చేశామన్నారు. రేషన్ కార్డుల్లో మార్పులు, చేర్పులకు అక్టోబర్ 31

వరకు అవకాశం కల్పిస్తామని తెలియజేస్తూ,

వాయిస్ 33 సెకన్లు

---------------------------

విద్యుత్ వాహనాల వినియోగంతో పర్యావరణాన్ని పరిరక్షించవచ్చుని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. హైదరాబాద్ లో నూతనంగా ఏర్పాటు చేసిన కార్ల దుకాణాన్ని కేంద్రమంత్రి నిన్న ప్రారంభించారు. సౌర, పవన విద్యుత్ వాహనాలను వినియోగించడం ద్వారా పర్యావరణాన్ని కాపాడటంతో పాటు ఆర్థికంగా లబ్ధి చేకూరుతుందని కేంద్రమంత్రి ఈ సందర్భంగా పేర్కొంటూ

వాయిస్ 35 సేకన్లు

---------------------------

కేంద్ర ప్రభుత్వం వస్తు సేవల పన్ను జీఎస్టీలో మార్పులు చేసి తగ్గించడం పట్ల అనంతపురం జిల్లా ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థులకు అవసరయ్యే విద్యా సామగ్రిపై జీఎస్టీని తగ్గించడం ద్వారా ఎక్కువ మంది విద్యార్థులకు విద్య సామగ్రి అందుబాటులోకి వస్తుందని అనంతపురానికి చెందిన రమేష్ ఆకాశవాణికి తెలియజేస్తూ

వాయిస్ 32 సెకన్లు

---------------------------

ఆంధ్రప్రదేశ్లోని తిరుపతిలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ పర్యటిస్తున్నారు. నిన్న తిరుపతి చేరుకున్న కేంద్రమంత్రికి రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, విమానాశ్రయంలో స్వాగతం పలికారు. అనంతరం రోడ్డు మార్గంలో ఆమె తిరుమలకు బయలుదేరి వెళ్ళారు. ఈ ఉదయం తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి వారిని కేంద్రమంత్రి దర్శించుకోనున్నారు.

---------------------------

ఉత్తరాంధ్ర, దక్షిణ ఒడిశా తీరంలో రానున్న రెండు రోజుల్లో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని అమరావతి వాతావరణ కేంద్రం వెల్లడించింది. దీని ప్రభావంతో ఆంధ్రప్రదేశ్ లోని పలు జిల్లాలో అక్కడక్కడ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారి ఎల్. నారాయణ తెలియజేస్తూ,

వాయిస్ 25 సెకన్లు

అలాగే తెలంగాణలోనూ రానున్న నాలుగు రోజుల పాటు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది.

======================